సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 20-3-2025

సంపుటి: 20 సంచిక: 303

పేజీలు: 8 వెల: రూ.1


## వైఎస్ఆర్ పేరు తొలగింపు

# రెడ్‌బుక్ అరాచకమే

### వైకాపా యూత్ నేత స్వరూప్ ధ్వజం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం అరాచకాలు సృష్టిస్తోందని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులే ధ్యేయంగా పని చేస్తోందని వైకాపా యువజన విభాగం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ విమర్శించారు. రాష్ట్రానికి గతంలో నాయకులు చేసిన కృషికి గుర్తింపుగా ప్రభుత్వాలు పలు నిర్మాణాలకు, ప్రాంతాలకు వారి పేర్లు పెట్టడం సాధారణమని, తర్వాత వచ్చే ప్రభుత్వాలు కూడా గత ప్రభుత్వాల ఈ నిర్ణయాలను గౌరవించి కొనసాగించేవని ఆయన పేర్కొన్నారు. కానీ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా నాయకుడైన వైఎస్ఆర్ పేరును - మిగతా చివరి పేజీలో

# పోలీసు.. పైలాపచ్చీసు!

- ఏసీబీ కానిస్టేబుల్ విపరీత ధోరణి
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్‌మీడియా పోస్టులు
- ప్రభుత్వ పెద్దలపైనే బూతులు
- సామాజిక మాధ్యమాల్లో నెగిటివ్ పోస్టులు
- ఏసీబీ విధుల నుంచి తప్పించిన డీజీ
- విచారణ చేపట్టిన సైబర్ క్రైమ్

**కొన్నేళ్ల క్రితం వరకు మన పక్కనున్న తమిళనాడుకు మాత్రమే పరిమితమైన ఉద్యోగులు రాజకీయ పార్టీలకు మద్దతు తెలిపే విధానం ఇప్పుడు మన రాష్ట్రానికి కూడా పాకింది. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ గత ప్రభుత్వంలో నాయకులకు అనుకూలంగా వ్యవహరించారంటూ అధికారులను, మరీ ముఖ్యంగా పోలీసులతో కుర్చీలాట ఆడటం సాధారణమైపోయింది. అటువంటిది ఏకంగా ఒక రాజకీయ పార్టీకి, ఆ పార్టీ అధినేతకు కొమ్ముకాస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఎవరైనా ఎందుకు ఊరుకుంటారు?! వ్యక్తులు, పార్టీలతో సంబంధం లేకుండా వ్యవహరించాల్సిన పోలీసులే పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తే ఏ ప్రభుత్వం మాత్రం ఎందుకు చేష్టలుడిగి చూస్తుంది?! వివరాల్లోకి వెళితే..**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం అవినీతి నిరోధక శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భైరి చంద్రశేఖర్ వైకాపాకు అనుకూలంగా ఫేస్‌బుక్‌లో పోస్ట్‌లు పెట్టడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు ట్రోల్ చేయడం కలకలం రేపింది. కొద్ది రోజుల క్రితం ఈ పోస్టులను కొందరు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ట్యాగ్‌చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న లోకేష్ డీజీపీకి ఫార్వర్డ్ చేయడంతో ఆయన ఏసీబీ డీజీకి వీటిని పంపించి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో రెండు రోజుల క్రితం భైరి చంద్రశేఖర్‌ను ఏసీబీ నుంచి రిలీవ్ చేసినట్టు భోగట్టా. సైబర్ క్రైమ్‌లో కూడా దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారని, ఇది పూర్తయిన తర్వాత భైరి చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తారని తెలిసింది. బాధ్యత గల పోలీసు ఉద్యోగంలో ఉండి మార్ఫింగ్ ఫొటోలు పోస్ట్ చేస్తున్న చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని, అలాగే మహిళల మార్ఫింగ్ ఫొటోలు, బూతులతో కూడిన ఆయన కామెంట్లను ఇక్కడ షేర్ చేయలేకపోతున్నామని, అకౌంట్ డిలీట్ చేసినా ఐపీ అడ్రస్ ఆధారంగా ఇతని మీద కేసు నమోదు చేయాలంటూ పోలీస్ శాఖను కొందరు కోరడంతో భైరి చంద్రశేఖర్ మీద చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది.

### ప్రజాధనంతో జీతం తీసుకుంటూ..!




- బాధ్యత గల పోలీస్ ఉద్యోగంలో ఉండి మార్ఫింగ్ ఫోటోలు పోస్ట్ చేస్తున్న బైరి చంద్రశేఖర్
- ఆడవారి మార్ఫింగ్ ఫోటోలు, ఇంకా కొన్ని బూతులు ఇక్కడ షేర్ చేయలేక ఇవ్వలేకపోతున్నాం
- అకౌంట్ డిలీట్ చేసినా ఐపీ అడ్రెస్ ఆధారంగా ఇతని మీద కేసులు నమోదు చేయాలని పోలీస్ శాఖని కోరుతున్నాం

#### ప్రభుత్వ పెద్దలకు వ్యతిరేకంగా

2021లో శ్రీకాకుళం ఏసీబీకి వచ్చిన చంద్రశేఖర్ స్వగ్రామం కిల్లిపాలెం. విజయవాడ సిటీ, రూరల్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసి డిప్యూటేషన్‌పై ఏసీబీకి వచ్చిన చంద్రశేఖర్ ఇప్పటికీ గత ప్రభుత్వానికి అనుకూలంగానే పోస్టులు, ఫొటోలు పెడుతున్నారు. ఫేస్‌బుక్‌లో 'మంచోడు మణి' అనే ఒక అకౌంట్ నుంచి కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కాలేదు, - మిగతా చివరి పేజీలో




## సాగునీటి సమస్యకు

# సత్వర పరిష్కారం

- అసెంబ్లీలో ఎమ్మెల్యే గొండు శంకర్ వినతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నియోజకవర్గంలో 30వేల ఎకరాల ఆయకట్టు భూములుంటే అన్నీ కూడా టైలెండ్(శివారు) భూములేనని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ భూములకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభలో గురువారం ఆయన మాట్లాడుతూ 37టి కాలువ పనులు జరగడంలేదని, వాటిని ఆ కాంట్రాక్ట్‌ను రద్దు చేసి కొత్త ఎస్టిమేషన్లతో మళ్లీ టెండర్లు పిలిచారన్నారు. ఆర్ఎంసీ పనులు నత్తనడకన సాగుతున్నాయని వాటిని వేగవంతం చేయాలని కోరారు. వత్సవలస వద్ద ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు చేశామని, వాటిని మంజూరు చేయాలని కోరారు. కళింగపట్నం ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితంగా పూర్తి చేయాలని కోరారు. రూ.175 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మంజూరైనా గత ప్రభుత్వం ఐదు శాతం పనులు కూడా చేయలేదని అన్నారు. ఈ పనులు సత్వరమే పూర్తి చేసే విధంగా సంబంధిత శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. నేరడి సెకండ్ ఫేస్ పనులు పూర్తిచేస్తే జిల్లాలో పంటలకు పూర్తిస్థాయి నీరు అందుతుందన్నారు, రిజర్వాయర్ నిర్మాణానికి ఒడిశాతో ఉన్న వివాదాలను పరిశీలించి ట్రిబ్యూనల్ క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయితే కుడి, ఎడమ కాలువల ద్వారా జిల్లాలో పంట భూములకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందని, అందువల్ల దీనిపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా రైతుల దీర్ఘకాలిక సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వ ముందుకు వెళ్లాలని కోరారు.

## మహిళలు కోసం ప్రత్యేకంగా ఎంసెట్ ప్రొగ్రాం

(సత్యంన్యూస్, నరసన్నపేట)

స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో మహిళల కోసం ప్రత్యేకంగా ఎంసెట్ ప్రొగ్రాం నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న నిష్ణాతులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నామని, ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థినులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 93939 29359 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

## గంజాయితో బంధముంటే

# ఆస్తులు జప్తు చేస్తాం

- మూడోదశలో 7,378 కేజీల గంజాయిని నిర్వీర్యం
- అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు
- రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గంజాయి రవాణా చేసినా, అమ్మినా సంబంధిత వ్యక్తుల ఆస్తులు జప్తుచేస్తామని, గంజాయి సేవించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలో గడిచిన 8 నెలల్లో గంజాయి నిర్మూలనకు రేంజ్ పరిధిలో పోలీస్ శాఖలో సమూలనమైన మార్పులు తీసుకు వచ్చామన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. 226 గంజాయి కేసుల్లో పట్టుకున్న 7378 కేజీల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో డీఐజీ నిర్వీర్యం చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతిపురం మన్యం జిల్లాల పోలీసులు వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న గంజాయిని గురువారం లావేరు మండలం పాత కుంకాం గ్రామం పరిధిలో ఉన్న రైన్‌బో ఇండస్ట్రీ వద్ద డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్, పార్వతీపురం మన్యం ఎస్పీ ఎస్.వి. మాధవ్‌రెడ్డి గంజాయి నిర్వీర్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ విశాఖపట్నం రేంజ్ పరిధిలో గడిచిన కొద్ది రోజుల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన, స్వాధీనం చేసుకున్న గంజాయిని నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. 2025 సంవత్సరంలో రేంజ్ పరిధిలో మొదటి దశలో అనకపల్లి జిల్లాలో జనవరి నెలలో 34.419 కేజీల గంజాయి, 39.4 లీటర్ల హాషిష్ ఆయిల్, రెండవ దశలో ఏఎస్ఆర్ జిల్లాల్లో ఫిబ్రవరి నెలలో 3075 కేజీల గంజాయిని, 25.5 లీటర్ల హాషిష్ ఆయిల్ నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. మూడో దశలో శ్రీకాకుళంలో ప్రస్తుతం డిస్పోజల్ చేస్తున్నామని తెలిపారు. గడిచిన 8 నెలల కాలంలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలన చర్యల్లో భాగంగా 524 కేసుల్లో 31768కేజీల గంజాయిని, 12.05 లీటర్ల హాషిష్ ఆయిల్, 372 వాహనాలు సీజ్ చేసి 2050 మంది నింతుల్ని అరెస్టు చేయగా అందులో 575 మంది ఇంటర్ స్టేట్ నిందితులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజులు ప్రణాళికలో రేంజ్ పరిధిలో గల ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని, గుర్తించి 24 అంతర్ రాష్ట్ర సరిహద్దుగా, 15 జిల్లాల సరిహద్దుగా ప్రధాన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాలకు అనుసంధానం చేసినట్టు తెలిపారు. గంజాయి సాగుని అరికట్టి, ప్రత్యామ్నాయ పంటలకు గాను 4.68 ప్లాంట్‌లో 22 రకాల విత్తనాలను 11 ఎకరాలకు రబీ సీజన్లో అందజేశామన్నారు. అదేవిధంగా రజ్మా చిక్కుడు విత్తనాలు 4496 కింటాలు విత్తనాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాల నిఘా ఏర్పాటు చేసి 327 గ్రామాల్లో 90 ఎకరాలు గంజాయి సాగుని గుర్తించి నిర్వీర్యం చేయడం జరిగిందని, ఇలాంటి గంజాయి సాగుకి పాల్పడినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్న తెలిపారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న 34 అంతర్ రాష్ట్ర ముఠాని 21, అంతర్ జిల్లాల ముఠాలను పట్టుకొని వారిలో 467 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నిందితులుగా గుర్తించామని, వారిపై కేసులను నమోదు చేశామని తెలిపారు. వీరులో 49 మందిపై పిడి యాక్టు, 1031 నిందితులపై గంజాయి సస్పెక్ట్ సీట్ తెరిచామన్నారు. గంజాయి రేంజ్ పరిధిలో పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు సంకల్పం పేరిట





అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 5లక్షల మంది విద్యార్థులు యువతకు చైతన్యం కల్పించి ప్రతి పాఠశాలలో కళాశాలలో డ్రాప్ బాక్స్‌ను ఏర్పాటుచేసి మత్తు పదార్థాల సమాచారాన్ని ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 23 గంజా కేసుల్లో 40 మందికి శిక్షలు పడగా, సుమారు 20 మందికి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షలు గంజాయితో పట్టుబడిన వారిపై ఖరారైందని, పెండింగ్‌లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా ట్రైల్ జరిగే చర్యలు తీసుకుంటామని అన్నారు. గంజాయి అక్రమ రవాణా ద్వారా ఆస్తులు సంపాదించినవారి అక్రమ సంపదని చట్ట ప్రకారం జప్తు చేస్తామని, ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో ఒక్క కేసులో, విజయనగరం జిల్లాలో ఒక కేసులో ఆస్తులు జప్తు చేసినట్లు తెలిపారు. రేంజ్ పరిధిలో గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన 86 మందిని డి-అడిక్షన్ కేంద్రాలకు పంపించి కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నామని, వినియోగానికి, సరఫరాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని, వాటి వలన అనేక అనర్థాలు కలుగుతాయని, అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సూరన, విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ సౌమ్యలత, శ్రీకాకుళం అదనపు పి.శ్రీనివాస రావు, డిఎస్పీలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

• ఎడిటోరియల్

# నోరుజారొద్దు - సంకీర్ణ ధర్మం తప్పొద్దు

సంకీర్ణ రాజకీయాలపై ప్రజలకు స్పష్టత ఉన్నా నాయకులకే స్పష్టత రావడం లేదని అపుడపుడు జరిగే సంఘటనలు చెప్తున్నాయి. డబ్బుకు ఓట్లు ఆమ్మేసుకుంటున్నారని ప్రజాస్వామ్యవాదులు, ఆలోచనా పరులు చికాకుపడిపోతున్నా.. ఓటర్లలో డబ్బుతీసుకునే అలవాటు పెరుగుతున్నా స్థూలంగా ఓటర్ల పరిణతి పెరుగుతూనే ఉంది. డబ్బుతీసుకుంటున్నా వారు దానికి అమ్ముడుపోవడంలేదని ప్రతి ఎన్నికా సూచిస్తూనే ఉంది. ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ లేనపుడు కొన్ని పార్టీల కలయికతో ఏర్పడేవే సంకీర్ణ ప్రభుత్వాలు. ఎన్నికలకు ముందు ఒక అవగాహనతో కొన్ని పార్టీలు కలిసి సీట్లు పంచుకుని పోటీ చేయడంలో రాజకీయ నిబద్ధత ఉంది. జగన్ పాలన అంతమే అజెండాగా 2024 ఎన్నికల ముందు టీడీపీ, జనసేన, బీజేపీలో కూటమిగా పోటీ చేసి విజయం సాధించాయి. ఉమ్మడి కార్యక్రమాలు చేపట్ట డం, విభేదాలు వచ్చినపుడు పరిష్కరించుకోవడం వంటి అంశాలే పొత్తులు లేదా కూటములను నిలబెడు తుంది. ఎన్నికలకు ముందే పొత్తులు కుదుర్చుకోవడం, రాజకీయ అనివార్యతలను బట్టి ఫలితాల తర్వాత పొత్తులు కుదర్చడంలో చంద్రబాబు కంటే ఎక్కువగా చక్రం తిప్పిన వారు లేరు. తెలుగుదేశం పార్టీ పెట్టిన ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే గుర్తింపు, గౌరవం తీసుకువస్తే.. సంకీర్ణ రాజకీయాలకు దశదిశలు నిర్దేశించిన చంద్రబాబు దేశ రాజకీయాల్లో ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా చేసి ప్రతిష్ట పెంచారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం పెంచడానికి, అధికార పదవుల్లో నియామకాలకు సంబంధించి చంద్రబాబు రూపొందించిన దామాషా ఫార్ములాను మూడు పార్టీలు అమలు చేస్తున్నాయి. వ్యక్తిగత రాగద్వేషాలను పక్కన పెట్టి చంద్రబాబు బీజేపీ నుంచి సోము వీర్రాజును ఎమ్మెల్సీ చేయడం, ముందు ఇచ్చిన హామీని పక్కన పెట్టి సొంత పార్టీకి చెందిన పిఠాపురం వర్మకు మొండిచెయ్యి చూపిం చడమూ సంకీర్ణ ధర్మంలో భాగమే. జనసేన ఆవిర్భావ సభలో పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు చేసిన 'ఖర్మ' వ్యాఖ్య కొంత అలజడి సృష్టించినా దానివల్ల కూటమికి బీటపడే పరిస్థితి లేదు. అయినా ఇలాంటివి పునరావృతం కాకుండా నాయకులందరూ చూసుకోవాలి. పవన్‌కల్యాణ్ విజయానికి పిఠా పురం నియోజకవర్గంలో తెలుగుదేశం నుంచి వర్మ, జనసేన నుంచి నాగబాబు విశేషంగా కృషి చేశారు. ఆ సందర్భంలో రెండు పార్టీల కేడర్‌లో సహజంగా ఉండే ఆధిపత్య భావన అభిప్రాయ బేధా లకు మూలమై ఉండవచ్చు. పార్టీల పరంగా వర్మ నియోజకవర్గ నాయకుడు. నాగబాబు రాష్ట్రస్థాయి నాయకుడు. సభలో నాగబాబు తన పెద్దరికాన్ని నిలబెట్టుకోలేకపోయారు. ఖర్మ వ్యాఖ్య ద్వారా విష యాన్ని పెద్దది చేశారు. ఇది ఆయనకు, పార్టీకి ఉపయోగపడకపోగా 'ఏరుదాటి తెప్ప తగలేస్తారా' అనే భావన కలిగించింది. వర్మకు రాష్ట్రవ్యాప్తంగా సానుభూతి తెచ్చిపెట్టింది. అంతర్గతంగా ఏం జరిగినా ప్రజలకు తెలీదు. బహిరంగ వ్యాఖ్యలే ఇబ్బందికర పరిస్థితులు తీసుకొస్తాయి. 'మాట పొదుపు నోరు అదుపు' సూత్రాన్ని ఏ నాయకుడూ మరచిపోకూడదు. సంకీర్ణ రాజకీయాల్లో ఇది చాలా ముఖ్యం. అనేక పరిమితుల మధ్య అధికారాలను అనుభవించడం సంకీర్ణ రాజకీయాల్లో పెద్ద ఛాలెంజ్. దీన్ని అర్థం చేసుకున్నవారు సమర్థులైన నాయకులవుతారు. లేకపోతే స్వల్పకాలంలోనే ఓటమి తప్పదు. ఇలాంటి పరిణామాలు ప్రభుత్వాల పతనానికి దారితీసినా ఆశ్చర్యం లేదు. కూటమికి ఇంకా ఏడాది నిండలేదు. ఇప్పటి నుంచే భాగస్వామ్య పార్టీలు, నాయకులు మరింత సంయమనంతో వ్యవహరించకపోతే దాదాపు 40% ఓటుబ్యాంకు ఉన్న జగన్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చినా ఆశ్చర్యం లేదు. రాష్ట్రంలోని వేలు, లక్షల మందికి ఏ పార్టీ మీదా ప్రత్యేకమైన అభిమానమూ లేదు. వ్యతిరేకతా లేదు. కాకపోతే గత ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకూడదన్న ఉద్దేశంతోనే కూటమికి ఓటు వేశారన్నది వాస్తవం. 2024 ఎన్నికల్లో 175 సీట్లకుగాను తెలుగుదేశం పార్టీ 135 స్థానాలు గెలుచుకోగా, జనసేన 21, బీజేపీ 8 స్థానాలు గెలుచుకుంటే అప్పటివరకు అధికారంలో ఉన్న వైకాపా 11 స్థానాలకే పరిమిత మైంది. అయితే ఓట్లపరంగా చూస్తే.. కూటమికి 1,86,56,300 ఓట్లు (55.29%) వచ్చాయి. వీటిలో టీడీపీకి 1,53,84,576 (46.6%), జనసేనకు 23,17,747 (6.86%), బీజేపీకి 9,53,957 (2.83%) ఓట్లు వచ్చాయి. మరోవైపు వైకాపాకు 1,32,84,134 (39.37%) ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 5,80,613 మంది ఓట్లు (1.72%) వేయగా, నోటాకు 3,96,320 మంది (1.09%) ఓట్లు వేశారు. ఈ లెక్కలు చూస్తే అతి తక్కువ సీట్లు పొంది అధికారం కోల్పోయిన వైకాపా ఓట్లపరంగా కాస్త బలంగానే ఉన్న విషయం గుర్తెరిగి కూటమి పార్టీలు సంయమనం పాటించాలి.


## వైఎస్ఆర్ పేరు తొలగింపు అన్యాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశాఖ నగరంలోని అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి వైఎస్ఆర్ పేరు తొలగించడం అన్యాయమని వైకాపా జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో విమ ర్శించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా శాంతిభద్రతలు పర్యవేక్షిస్తూ ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రయత్నిస్తుందని, కానీ కూటమి ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టినప్పటినుంచీ విధ్వం సం సృష్టిస్తోందని విమర్శించారు. పాలక కూటమి పెద్దలు, కార్యకర్త లు రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలను ధ్వంసం చేయడం, వైఎస్ జగన్ పేరును తొలగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నార న్నారు. వైఎస్సార్ పేరు తలవడానికే భయపడే కూటమి ప్రభుత్వం ఆయన ఆనవాళ్లు చెరిపేయడమే ధ్యేయంగా పెట్టుకుందని విమర్శిం చారు. కానీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వైఎస్ఆర్ జ్ఞాపకాలను మాత్రం చెరిపేయలేరని అన్నారు.

## క్యాట్ లెవెల్-2లో అభిసాత్విక ప్రతిభ



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

శ్రీచైతన్య విద్యాసంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నాలెడ్జ్ అసె స్మెంట్ టెస్ట్ (క్యాట్) లెవెల్ 2 పరీక్షలో ఆమదాలవలస మండలం తోటాడ కొత్తరోడ్డు జంక్షన్‌కు చెందిన దుగ్గివలస అభిసాత్విక సత్తా చాటింది. ఇటీవల నిర్వహించిన ఈ పరీక్షలో ప్రతిభ చూపి బంగారు పతకంతో పాటు రూ.వెయ్యి నగదు పురస్కారం పొంది నట్లు తల్లిదండ్రులు దుగ్గివలస రాంప్రసాద్, భవానీ తెలిపారు. విజయవాడలోని ఐపీఎల్ బ్రాంచ్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న అభిసాత్విక ఈ పురస్కారాలను ఐపీఎల్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ సురేష్ బాబు చేతుల మీదుగా అందుకుంది. అకడమిక్ ప్రిన్సిపాల్, ఎగ్జి క్యూటివ్ డీన్ నాగభూషణం, ఐపీఎల్ బ్రాంచ్ ఇన్‌ఛార్జీలు డి.శ్రీని వాసులు, కేటీసీ ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు అభిసాత్వికను అభినందించారు.

## 'వంశధార'ను ఆధునీకరించాలి



(సత్యంన్యూస్, అమరావతి)

పాతపట్నం నియోజకవర్గంలో ఉన్న వంశధార ప్రాజెక్టును ఆధునీకరణ చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం అసెంబ్లీలో సంబంధిత మంత్రికి స్పీకర్ అయ్యన్న పాత్రుడు ద్వారా తెలిపారు. వంశధార ప్రాజెక్ట్‌లోని ఎడమ, కుడి కాలువల ఆయకట్టు చివరి ఎకరా వరకూ సాగునీరు అందించాలఅన్నారు. అలాగే లెఫ్ట్, రైట్ కెనాల్లో 100 ఎంఎం సిసి లైనింగ్ ఏర్పాటు చేయాలని, ఆయకట్టులో భాగంగా ఎత్తైన భూములకు నీరందించడానికి అవసరమైనచోట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం పూర్తిగా ఇరిగేషన్‌ను నిర్వీర్యం చేసిందని, అందుకే ఈ పరిస్థితి వచ్చిందని ఎంజీఆర్ అన్నారు.

## చిన్నశ్రీనుకు పిన్నింటి పరామర్శ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, భీమిలి వైకాపా ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాస్ (చిన్న శ్రీను)ను ఎచ్చెర్ల వైకాపా నాయకుడు పిన్నింటి సాయి కుమార్ పరామర్శించారు. 2020లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్న శ్రీను తనయుడు అప్పటినుంచి చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. విజయనగరం లో స్వగృహానికి తీసుకొచ్చిన మృతదేహాన్ని సాయి కుమార్ సందర్శించి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ మాజీ



చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, వైకాపా మాజీ కన్వీ నర్ మహంతి పెద్దరామునాయుడు, మండలి సూర్య నారాయణ, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గేట్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ర్యాంకులు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

తాజాగా వెలువడిన గేట్-2025 ఫలితాల్లో ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్(ఎచ్చెర్ల) విద్యా ర్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కొమరాల శ్వేతశ్రీ 241, అప్పన్న శ్రీనివాస్ 663 వ ర్యాంక్ సాధించగా మరో 60 మంది విద్యార్థులు కూడా మంచి ర్యాంకులు సాధించారని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య బాలాజీ తెలిపారు. విద్యార్థులను అభినందిస్తూ మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకు లను కూడా అభినందించారు. ట్రిపుల్ ఐటీ ఏవో మునిరామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు గేట్‌లో మంచి ర్యాంకులు సాధించడం





ద్వారా మిగిలిన సంస్థల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఎఫ్‌వో వాసు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ గేదెల రవి, సీఎస్ఇ విభాగపతి రమేష్ కుమార్, పలువురు విభాగపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పురాణాల్ని తెరకెక్కించడంలో.. తెలుగోడికి సాటెవ్వడు..?





**1972**లో బాపుగారు 'సంపూర్ణ రామాయణం' సినిమా తీస్తున్నారు. నటి జమున దగ్గరకు వెళ్లి డేట్లు అడిగారు. ఏం వేషం అన్నారామె. 'కైక' అని చెప్పారు. 'సీత పాత్రకు మరెవరినో పెట్టుకుని, నాకు కైక పాత్ర ఏమిటి? బాగుండదు' అన్నారావిడ. 'అమ్మా! సీత పాత్ర అంటే మౌనంగా ఉండాలి. కుదురుగా కూర్చోవాలి. అంతే! కానీ కైక పాత్రలో ఎన్ని వేరియేషన్లు! ధీశాలి. దశరథుడికి ఇష్టసఖి. భరతుడి తల్లి. రాముణ్ని కనకపోయినా కన్నంత ప్రేమగా పెంచిన అమ్మ. చెప్పుడు మాటలు విని ఆ రాముడినే అడవులకు పంపమని భర్తను కోరిన ఇల్లాలు.. ఎన్ని అంశాలు ఉన్నాయి ఆ పాత్రలో! మీరైతే ఆ పాత్రకు న్యాయం చేయగలుగుతారు' అని బాపు, రమణలు ఆమెను ఒప్పించారు. జమున ఆ పాత్ర చేసి మెప్పించారు.

ఆ సినిమాలోనే మరోటి! ది గ్రేట్ ఎస్వీ రంగారావు రావణాసురుడు. మొదటి రోజు సెట్‌కి వచ్చారు. సీత పాత్రలో చంద్రకళ. 'ఇదేమిటీ? ఈ అమ్మాయి సీతా? జమున అనుకున్నానే!' అన్నారు. 'ఆమె కైక పాత్ర చేస్తున్నారు. ఈ అమ్మాయే సీత' అని సమాధానం ఇచ్చారు. 'నో.. నో.. మార్చండి. సీత పాత్రకు ఈ అమ్మాయి ఏమిటి? నా పక్కన ఏమాత్రం ఆనదు. ఈమె కోసం నేను యుద్ధం చేయాలా?' అన్నారట. బాపు, రమణలు ఆయనకు నచ్చజెప్పి ఒప్పించారు. సీత పాత్రలో చంద్రకళ చక్కగా నటించారు. అయితే తెలుగువాళ్లకు సీతమ్మ అంటే అప్పటికీ ఇప్పటికీ అంజలీదేవే. (ఆమె మరణించినప్పుడు 'తెలుగింటి సీతమ్మ కన్నుమూత' అని రాశాయి పేపర్లు). అందుకే చంద్రకళ సీత పాత్ర చేశారన్న విషయం చాలామందికి గుర్తు లేదు.



తమిళవాళ్లు 1964లో 'కర్ణ' తీశారు. తమిళ సినీరంగంలో మైలురాయిగా నిలిచిపోయిన సినిమా. శివాజీ గణేశన్ టైటిల్ రోల్ చేశారు. కర్ణుడి కథలో శ్రీకృష్ణుడు లేకపోతే ఎలా? కానీ ఆ పాత్ర ఎవరు వేయాలి? ఇంకెవరు? ఎన్టీ రామారావే! ఆయనే ఆ పాత్ర పోషించారు. ఆ తర్వాత తమిళంలోనే 'కన్నన్ కరుణై' అనే సినిమా తీసి అందులో పూర్తిస్థాయిలో శ్రీకృష్ణుడి పాత్ర పోషించారు ఎన్టీఆర్. ఆ సినిమాకి ఆయనే దర్శకత్వం వహించారు. భారతదేశంలో చాలా భాషల్లో శ్రీకృష్ణుడి గురించి సినిమాలు తీశారు. అందులో చాలామంది నటులు కృష్ణుడి పాత్ర పోషించారు. కానీ ఎన్టీఆర్‌కి వచ్చినంత పేరు మరెవరికీ రాలేదు. అత్యధిక పౌరాణిక పాత్రలు పోషించిన నటుడిగానూ ఎన్టీఆర్ రికార్డును మరెవరూ ఢీకొనలేరు.

మనం తెలుగువాళ్లం. పురాణ పాత్రల మీద మనకు బోలెడంత శ్రద్ధ. ఎవరు ఏ పాత్ర వేయాలో మనకో ఊహ ఉంది. శ్రీకృష్ణుడు అంటే నందమూరి తారక రామారావు, సత్యభామ అంటే జమున, శకుని అంటే ధూళిపాళ సీతారామశాస్త్రి, గాంధారి అంటే ఎస్.వరలక్ష్మి, రావణాసురుడంటే ఎన్టీయార్ లేదా ఎస్వీఆర్, కీచకుడు అంటే అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ ఎస్వీఆరే.. మనం అలా ఫిక్స్ అయ్యాం. కారణం ఆ సినిమాలు, వాళ్ల నటన. మరొకరిని ఆ పాత్రలో ఊహించడం కష్టం. చేయలేరని కాదు. చేశారు. చూశాం! కానీ మనకై మనం గీసుకున్న ఊహల్లో ఉన్న పురాణపాత్రధారులు వాళ్లే. పురాణాలు తీయడంలో తెలుగు వాళ్లకు బోలెడంత దమ్ముంది. అంతా ఇంతా కాదు, కొండంత. అందరికీ తెలిసిన కథలే! అయినా మళ్లీ మళ్లీ తీశాం. మళ్లీ మళ్లీ చూశారు. హిట్ చేశారు. తెలుగు వాళ్లు తీసినన్ని పౌరాణిక సినిమాలు బహుశా మరే ఇతర భాషలోనూ తీయలేదు. అడపాదడపా ఆయా భాషల్లో తీసినవి ఏవీ పెద్దగా ఆడలేదు. గుర్తింపు రాలేదు.

**తెలుగువారికి పురాణాలు ఇంటి సొత్తు. నాటికలు, పాటలు, పద్యాలు, సామెతలు, జాతీయాలు, ఊతపదాలు.. అన్నింటా పురాణల ప్రస్తావన ఉండాల్సిందే! భారతాన్ని తెలుగులోకి ముగ్గురు కవులు తెలుగులోకి అనువదించారు. కవిత్రయం అనే పేరు పొందారు. పోతన శ్రీమద్భాగవతం రాశారు. నేటికీ ఆ పద్యాలు మనకు విని పిస్తున్నాయి. రామాయణాలైతే చెప్పనక్కర్లేదు. ఎందరో రామకథ రాశారు. దాని మీద విమర్శా రాశారు. పిట్టకథల రూపంలో బోలెడన్ని సార్లు రామాయణాన్ని తల్చుకుంటూనే ఉంటాం.**


ఇతర భాషల వాళ్లు పురాణాలు తీయలేరా? తీయగలరు. కానీ తెలుగు వాళ్లలా తీయలేరు. మనం తీసిన పౌరాణిక సినిమాలతో ఇతర భాషా పౌరాణిక చిత్రాలు ఏరోజూ పోటీ పడలేవు. కారణం రాముణ్ని, కృష్ణుణ్ని మనం చూసిన తీరు. ఆ పాత్రల్ని తెరపై చూపించిన తీరు. ఆ పాత్రల్ని మన ఇంటి మనుషులుగా మార్చుకున్న తీరు. నాస్తికులైనా సరే, ఆ పాత్రల్ని ఎంజాయ్ చేసేలా వాటిని మలిచిన తీరు. ఇవన్నీ కలిసి 'పురాణాలు తీస్తే తెలుగు వాళ్లే తీయాలి' అనే పేరు తెచ్చాయి. 'మాయాబజార్' చూశారా? 'ఆంధ్రమాత గోంగూర లేనిదే కౌరవ మహారాజు ముద్ద కూడా ముట్టరు' అంటారు పురోహితులు. పురాణాల స్థలజ్ఞత ప్రకారం కౌరవులది హస్తినాపురం (ఢిల్లీ). వాళ్లకు గోంగూర ఇష్టం కావడం ఏమిటి? పైగా 16-17వ శతాబ్దం మధ్యలో కదా గోంగూర భారతదేశానికి వచ్చింది. అయినా సరే, పింగళి నాగేంద్రరావు కలం అలా కదం తొక్కింది. మనం కాదన్నామా? పోనిద్దూ కౌరవులు తెలుగువాళ్లే అనుకున్నాం. ఇంత అనుబంధం బహుశా మరో భాషల్లోని వారికి లేదు. వారికి రాముడు, కృష్ణుడు దేవుళ్లు. తెలుగు వాళ్లకి మాత్రం ఇంటి మనుషులు.

అంతెందుకు? విశ్వనాథ సత్యనారాయణ 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' రాస్తూ ఇద్దరు పని మనుషుల మధ్య అలుకుగుడ్డల కోసం పేచీ వచ్చినట్టు రాశారు. ఎందుకు? సీతారాముల కళ్యాణంలో ఏదో ఒకటైనా తగవు ఉండాలని ఆయనకు సరదా పుట్టింది. రాశారు. మనకు పురాణాలు అంటే అంత ఇష్టం. అంత సరదా. అంత ప్రేమ.

ఎక్కడో చదివిన సంగతి గుర్తొస్తోంది. 1963లో కమలాకర కామేశ్వరరావు 'నర్తనశాల' సినిమా తీశారు. ఆ సినిమా ఘనవిజయం సాధించింది. జకార్తాలో జరిగిన ఆఫ్రో-ఏషియన్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శితమైంది. అందులో కీచకుడి పాత్ర పోషించిన ఎస్వీ రంగారావుకి ఉత్తమ నటుడి అవార్డు ఇచ్చారు. దాంతోపాటు ఆ సినిమాకి కళా దర్శకుడిగా వ్యవహరించిన శర్మకి ఉత్తమ కళా దర్శకుడి అవార్డు ఇచ్చారు. ఒక అంతర్జాతీయ సినీ వేదికపై తొలిసారి ఇద్దరు తెలుగు వ్యక్తులు అవార్డులు అందుకోవడం అదే ప్రథమం. ఆ తర్వాత మద్రాసులో ఒక పెద్ద వేడుక చేసి శర్మని సన్మానించారు. అందరూ ఆయన కృషి గురించి పొగిడారు. చివరకు శర్మని మాట్లాడమన్నారు.

శర్మ లేచి 'నేను ఈ స్థితికి రావడానికి ఎంతోమంది కారణం. ఆ మహానుభావులందరికీ రెండు చేతులెత్తి నమస్కరించాలని ఉంది. కానీ ఆ పని చేయలేకపోతున్నాను' అని కళ్ల నీళ్లు పెట్టుకున్నారు. ఎందుకంటే శర్మకి ఒక చెయ్యి లేదు. ఒంటి చేత్తోనో ఎన్నో సినిమాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. కొందరికి వాళ్ల వృత్తి పట్ల ఉండే నిబద్ధత అది.

- సాయి వంశీ (విశీ)



# దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే అప్పులోయ్

దిగజారుతున్న ఏపీ ఆర్థిక పరిస్థితి

***దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్నారు గురజాడ. కానీ ఇప్పుడు దీన్ని కొద్దిగా మార్చాల్సివస్తోంది. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే అప్పులోయ్ అనాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు ఎడాపెడా అప్పులు చేస్తున్నాయి. దేశాన్ని అప్పుల ఊబిలోకి లాగుతున్నాయి. ఇందులో మన తెలుగు రాష్ట్రాలు కూడా బాగానే పోటీపడుతున్నాయి. రాష్ట్రాల వారీగా ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అదే ఆర్బీఐ విడుదల చేసిన గణాంకాలు చూస్తే మతిపోతోంది.***

దేశంలో ఆయా రాష్ట్రాలు అప్పు ఊబిలో కూరుకు పోతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. గతంతో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రాల అప్పులు భారీగా పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. దేశంలో భారీ అప్పులతో టాప్ -10 రాష్ట్రాలను చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు కూడా టాప్ 10 జాబితాలోనే వున్నా ఏడెనిమిది స్థానాలకు రావడం కొంత మెరుగే.

దేశంలో అనేక రాష్ట్రాల్లో అప్పు భారీగా పెరిగిపోతోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఇందుకు సంబంధించిన అప్పుల డేటాను విడుదల చేసింది. గత ఐదేళ్లలో ఈ రాష్ట్రాల అప్పుల్లో భారీ పెరుగుదల ఉందని ఆర్బీఐ చెబుతోంది. రాష్ట్రాల్లో అప్పుల భారం దాదాపు 74 శాతం పెరుగుదల ఉందని చెబుతోంది.

2019 సంవత్సరంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అప్పులు రూ.47.9 లక్షల కోట్లుగా ఉండగా, ఇప్పుడు అది రూ.83.3 లక్షల కోట్లకు పెరిగింది. 2024లో అత్యధికంగా అప్పులు ఉన్న రాష్ట్రాలను గమనిస్తే, తమిళనాడు రూ.8.3 లక్షల కోట్ల అప్పుతో మొదటి స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఇక్కడ అప్పు రూ.7.7 లక్షల కోట్లు. ఇక 7.2 లక్షల కోట్ల అప్పులతో మహారాష్ట్ర మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్ రూ.6.6 లక్షల కోట్ల అప్పులతో నాల్గవ స్థానంలో ఉంది. అలాగే రూ.6 లక్షల కోట్లతో కర్ణాటక ఐదవ స్థానంలో ఉంది. భారత దేశంలో రాజస్థాన్ రూ.5.6 లక్షల కోట్లతో ఆరో స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ రూ.4.9 లక్షల కోట్లతో ఏడో స్థానంలో ఉంది.

అయితే ఆర్బీఐ లెక్కల ప్రకారం చూపించిన ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.4.9 లక్షల కోట్లు. కేంద్రం, ఆర్బీఐ, దాని పరిధిలో నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ పరంగా చేసిన అప్పు. మరో రూ.5 లక్షల కోట్లు అప్పూ వుందని ప్రభుత్వమే చెబుతోంది. అంటే మొత్తం అప్పులు సుమారు రూ.10 లక్షల కోట్లు ఉందన్నమాట. కార్పొరేషన్ల పరంగా ఇతరత్రా ఇబ్బడిముబ్బడిగా ప్రభుత్వమే అప్పులు చేసింది.

గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల పరంగా ఏపీ బడ్జెట్ గణాంకాలను అనుసరించి ఆర్బీఐ నివేదిక విడుదల చేసింది. దానిప్రకారం ప్రతి సంవత్సరం ఆదాయం పెరుగుతున్నా, అంతకు మించి వ్యయం కూడా పెరుగుతోంది. అయితే మూడేళ్లుగా ఆర్థిక లోటును తగ్గించుకునే ప్రయత్నం జరుగుతోంది. 2022-23లో ఆదాయం అంచనా 1,57,768 కోట్లు కాగా, వ్యయం 2,01,255 కోట్లుగా వుంది.

అంటే ఆర్థిక లోటు 43,487 కోట్లుగా వుంది. 2023-24లో ఆదాయం 1,73,767 కోట్లు కాగా, వ్యయం 2,12,449గా వుంది. రెవెన్యూ లోటు 38,682 కోట్లు. అదే రీతిలో 2024-25 బడ్జెట్ అంచనాలలో ఆదాయం 2,01,173 కోట్లు కాగా, వ్యయం 2,35,917గా వుంది. ఆర్థిక లోటు 34,743 కోట్లుగా వుంది.

అయితే 2018-19లో వృద్ధిరేటు 11.14 శాతం ఉందని, వైకాపా హయాంలో అది 10.32 శాతానికి తగ్గింది. రాష్ట్ర వృద్ధిరేటు 15 శాతం లేదా అంతకంటే పైస్థాయిలో ఉంటేనే వైకాపా హయాంలో చేసిన అప్పులకు అసలు, వడ్డీ చెల్లించగలుగుతాం. వైకాపా హయాంలో కూడా వృద్ధిరేటు అంతకుముందు స్థాయిలోనే పెరిగి ఉంటే గత ఐదేళ్లలో జీఎస్డీపీ అదనంగా రూ.7లక్షల కోట్లు పెరిగి ఉండేది. అధిక వడ్డీలకు అప్పులుచేసే అవసరం ఉండేది కాదు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శ్వేత పత్రాలు విడుదల చేస్తూ చెప్పిన మాటలు. 2022-23లో వైకాపా ప్రభుత్వం రూ.67వేల కోట్ల అప్పులు తెచ్చింది. దీనిలో మూలధన వ్యయం రూ.7,244 కోట్లే. తెచ్చిన అప్పులకు తోడు ఆదాయం పెరగక పోవడంతో అప్పుల చెల్లింపు సామర్థ్యం సున్నాకు చేరుకుంది. తెచ్చిన అప్పుల సొమ్మును దుబారా చేశారు. రాష్ట్ర ఆదాయం కూడా 17.1 శాతం నుంచి 9.8 శాతానికి తగ్గింది. అప్పులు 16.5 శాతం మేర, వడ్డీ 15 శాతం మేర పెరిగింది. ఎక్కువ వడ్డీకి అప్పులు తేవడం, మూలధన వ్యయం లేకపోవడం, పన్నులు పెంచడం లాంటి వివిధ అంశాల కారణంగా ఏపీ అప్పుల ఊబిలో కూరుకుపోయింది అంటూ చంద్రబాబు వివరించారు.

గత ఐదేళ్లలో ఖర్చులు 11.5 శాతం పెరిగాయి. నిర్వహణ పేరుతో దుబారా ఖర్చులే అధికంగా ఉన్నాయి. జీఎస్ డీపీలో సొంత ఆదాయం 7.1 నుంచి 6.4 శాతానికి తగ్గిపోయింది. 2014-19 మధ్యలో అప్పుల చెల్లింపు సామర్థ్యం 22.7 శాతం ఉండగా, 2022-23లో సున్నాకు చేరిందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం తెచ్చిన అప్పుల్లో మూలధన వ్యయం 2014-19 మధ్యలో 59.15 శాతం, 2019-24 మధ్య 22.54 శాతంగా ఉంది. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు తక్షణ కర్తవ్యంగా మూలధన వ్యయం, రెవెన్యూ వనరులు పెంచుకోవడం, ఆర్థిక క్రమశిక్షణ అమలు చేయాల్సివుంది.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ - కాగ్ లెక్క ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 మధ్య కాలంలో 3,47,944.64 కోట్ల రూపాయల అప్పును తీర్చాలి. అంటే అసలు, వడ్డీని తీర్చేందుకు ఏడాదికి సుమారు 40వేల కోట్ల రూపాయల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సమర్పించిన లెక్కల ఆధారంగా కాగ్ ఈ లెక్కలను తేల్చింది. వివిధ కార్పొరేషన్ల అప్పులు, ఇతర పెండింగు చెల్లింపుల భారాలు కలిపితే రాబోయే ఐదేళ్లలో ఏడాదికి 93 వేల కోట్ల నుంచి 1.30 లక్షల కోట్ల రూపాయలకు ఈ చెల్లింపుల భారం పెరిగిపోయే ప్రమాదం కనిపిస్తోంది.

ఇక ఆర్బీఐ నివేదిక ప్రకారం రాష్ట్రాల పరంగా 2021-22 నుంచి 2023-24 వరకు రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఏకీకృత స్థూల ఆర్థిక లోటును జీడీపీలో 3 శాతం లోపలే ఉంచుకున్నాయి. ఆదాయ లోటును జీడీపీలో 0.2 శాతం వద్దనే కొనసాగించాయి. నిరంతరం అధిక రుణ స్థాయిలు, ఆకస్మిక బాధ్యతలు, పెరుగుతున్న సబ్సిడీ భారం వృద్ధిని పెంచే మూలధన వ్యయానికి ప్రాధాన్యత ఇస్తూ మరింత ఆర్థిక క్రమశిక్షణ అవసరాన్ని నొక్కి చెబుతున్నాయని ఆర్బీఐ నివేదిక తెలిపింది. 2024-25లో, రాష్ట్రాలు జీడీపీలో 3.2 శాతం జీఎఫ్డీ బడ్జెట్‌తో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించాయని వెల్లడించింది.

**- బాలకృష్ణ ఎం, సీనియర్ జర్నలిస్ట్,**
ది వైర్ కోసం..

**PUBLIC DEBT OUTSTANDING**
**2018-19 RS. 2,57,509.87 CR**
**2023-24 RS. 4,91,734.11 CR**

2024-25 | 14

Public Debt Outstanding

₹ In Crore

| Year | Open Market Loans | Loans from Central Govt. | Loans from Other Institutions | Small Savings | Provident Fund | Deposits and Reserve Funds | Total | % of GSDP |
|---|---|---|---|---|---|---|---|---|
| ACCTS. 2018-19 | 1,55,376.48 | 10,223.01 | 15,393.26 | 12,504.27 | 16,583.28 | 47,429.57 | **2,57,509.87** | 28.02 |
| ACCTS. 2019-20 | 1,88,820.01 | 10,942.54 | 16,318.52 | 11,331.32 | 16,745.44 | 57,644.54 | **3,01,802.37** | 31.02 |
| ACCTS. 2020-21 | 2,29,317.60 | 14,171.01 | 16,612.47 | 10,158.37 | 23,275.97 | 57,021.50 | **3,50,556.92** | 35.53 |
| ACCTS. 2021-22 | 2,65,420.98 | 17,672.44 | 17,544.43 | 8,985.42 | 26,990.25 | 41,473.09 | **3,78,086.61** | 31.46 |
| Accounts 2022-23 | 311234.98 | 24508.31 | 18482.13 | 7812.47 | 28277.47 | 39210.37 | **429525.72** | 32.60 |
| 2023-24 RE | 366564.51 | 28138.34 | 19858.87 | 6639.52 | 29791.68 | 40741.18 | **491734.11** | 33.71 |
| 2024-25 BE | 416462.11 | 45368.60 | 20808.51 | 5506.06 | 31176.81 | *40772.17 | **560094.25** | 34.14 |

* Outstanding debt includes un-apportioned amount of Rs.4422.59 crores.

## పావురం ఈకపై సునీత విలియమ్స్ చిత్రం




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అంతరిక్ష కేంద్రం నుంచి సురక్షితంగా వచ్చిన భారతీయ సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ గౌరవార్థం పావురం ఈకపై ఆమె చిత్రాన్ని ప్రముఖ చిత్రకారుడు వాడాడ రాహుల్ పట్నాయక్ రూపొందించారు. నగరానికి చెందిన రాహుల్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో పురస్కారాలు పొందారు. పక్షుల వెంట్రుకలపై శ్రీనివాస కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, శ్రీకృష్ణ రాసలీల ఘట్టాలతో పాటు సింహాద్రి అప్పన్న, ఈశ్వరుడు, వినాయకుడు తదితర చిత్రాలు వేశారు. అలాగే స్వామి వివేకానంద, భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా చిత్రాలను పక్షివెంట్రుకలపై అపురూపంగా వేశారు. పాఠశాలల గోడలపై ఎన్నో విద్యా సంబంధిత చిత్రాలను వేసి ప్రశంసలు పొందారు. గత రెండు దశాబ్దాలుగా లలితకళల్లో ఒకటైన చిత్రలేఖనానికి విశిష్ట సేవలంది స్తున్నారు. ఆయా రచయితల పుస్తకాలకు ముఖచిత్రాలు వేసి కళాప్రియుల హృదయాలను దోచుకుంటున్నారు. బియ్యపు గింజలపై సైతం చిత్రాలను వేసి తన సత్తా చాటుకుంటున్నాడు. అమెరికా బుక్ ఆఫ్ వరల్డ్, రావా బుక్ ఆఫ్ వాల్ రికార్డ్స్, ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, హై రేంజ్ వరల్డ్ రికార్డ్స్, గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, గిన్నీస్‌బుక్‌లో స్వర్ణపతకం సాధించాడు. ఈ రికార్డుల్లో సముచిత స్థానం పొందాడు. విశాఖపట్నం చిత్రకళా పరిషత్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాహుల్‌కు వడ్డాది పాపయ్య స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. వడ్డాది గీచిన వందలాది చిత్రాలను సూక్ష్మీకరించి అందంగా తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే. ఈ చిత్రకారుని ప్రతిభను స్థానిక మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.



## ఉగాది కవితా పోటీల విజేతలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

వేమన కవితామయం (శ్రీకాకుళం), తపస్వీ మనోహరం(హైదరాబాద్) సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన విశ్వావసు నామ ఉగాది (2025) కవితా సంపుటాల పోటీ విజేతలను ప్రకటించారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో ఈ నెల 23న ఉదయం 9.30 గంటలకు బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ఇస్తామని నిర్వాహకులు నిమ్మగడ్డ కార్తీక్, మహ్మద్ రఫీ (ఈ వేమన) పేర్కొన్నారు. కార్యక్రమంలో బహుమతి ప్రదాతగా కేంద్ర సాహిత్య అకాడమీ బాలల పురస్కార విజేత నారంశెట్టి ఉమామహేశ్వరరావు (పార్వతీపురం) పాల్గొంటారు. బహుమతి నిర్ణేతగా సాహితీ వేత్త జంధ్యాల శరత్‌బాబుతోపాటు వేమన కవితమయం గౌరవ అధ్యక్షుడు సురంగి మోహనరావు, కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, తపస్వి మనోహరం తరపున బి.తేజస్విని కార్యక్రమానికి సారధ్యం వహిస్తారు.

**విజేతలు:** పద్మావతి రాంభక్త (మెతుకు వెలుగులు), యాములపల్లి నరసిరెడ్డి (శిలా వృక్షం), వైరాగ్యం ప్రభాకర్ (ఆకాశమంత), బగాది వెంకటరావు (బగాది బాసలు), వైతాళీయ కుచేలోపాఖ్యానం (మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ, కడలి కవితా ప్రసూనాలు (కడలి ప్రకాశరావు) వీరంతా వరుసగా విశాఖ, అనంతపురం, కరీంనగర్, శ్రీకాకుళం, గుంటూరు, విజయనగరం ప్రాంతీయులని నిర్వాహకులు చెప్పారు.

## ఉగాది పోటీల్లో అమ్మోజీ కవిత ఎంపిక



**(సత్యంన్యూస్, రణస్థలం)**

విశ్వావసు సంవత్సరం ఉగాది సందర్భంగా ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నిర్వహిస్తున్న జాతీయ కవి సమ్మేళనానికి శ్రీకాకుళం జిల్లా నుంచి వర్ధమాన రచయిత్రి అమ్మోజి బమ్మిడి ఎంపికయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ బుధవారం ఆమెకు ఆహ్వానపత్రం పంపించారు. పల్లె జీవన విధానం, వలస బతుకులపై రాసిన 'పల్లె గూటికి పండగొచ్చింది' కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 28న శుక్రవారం నెల్లూరు జిల్లా వెంకటాచాలంలోని ప్రాచీన తెలుగు కేంద్రంలో జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనాలని ఆ కవితను ఆలపించాలని కోరారు. కార్యక్రమంలో జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సంప్రదాయబద్ధంగా సత్కరిస్తామని తెలిపారు.

## ఆపదలో ఉన్న మిత్రునికి స్నేహితుల సాయం

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**

గాజులకొల్లివలస గ్రామానికి చెందిన ఎన్.సంగమేష్ భార్య వసంతకుమారి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈవిడ మృతి విషయం తెలుసుకున్న అతని స్నేహితులు (ఇంటర్మీడియట్ బ్యాచ్ 2001-03) ఆయన ఇంటికి చేరుకొని తమవంతు సాయంగా రూ.40వేలు సంగమేశంకు అందజేశారు. కార్యక్రమంలో ఆయన స్నేహితులు పాల్గొన్నారు.



ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

## ఆహారాన్ని వృథా చేయకండి

**లయన్స్ మార్కెటింగ్ ఛైర్‌పర్సన్ ఉర్లం శివతేజ**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్సవాలు, శుభకార్యాలు, ఇతర వేడుకల్లో విందు భోజనాల్లో మిగిలిపోయే ఆహారాన్ని వృథాగా పారబోయవద్దని సామాజిక కార్యకర్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ ఛైర్మన్ ఉర్లం శివతేజ సూచించారు. స్థానిక ధమ్మలవీధి, లెప్రసీ కాలనీల్లో పేద కుటుంబాలకు ఆహారం అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లలో జరిగే వేడుకల్లో మిగిలిపోయే ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు పంచిపెట్టాలని లేదా తమకు సమాచారమందిస్తే తాము వాటిని తీసుకెళ్లి ఆపన్నులకు అందిస్తామన్నారు. మిగిలిపోయిన ఆహారం అందజేయాలంటే 8790944902 నెంబరుకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొట్టా సాయికుమార్, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్, పొడుగు చరణ్, జి.పవన్‌కుమార్, నేటి దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణ విద్య కూడా నేర్చుకోవాలి

**- పెద్దఎత్తున శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించిన పోలీసులు -**

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

విద్యార్థినులు ఆపద నుంచి బయటపడేందుకు ఆత్మరక్షణ టెక్నిక్స్‌ను కూడా నేర్చుకోవాలని శక్తి టీమ్ ఎస్ఐ రవికుమార్ అన్నారు. ఈమేరకు ఓ ట్రైనర్‌ను తీసుకువచ్చి ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాగర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు టెక్నిక్‌లు నేర్పించారు. ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్‌ను విద్యార్థులందరితోను డౌన్‌లోడ్ చేయించారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించాలో నేర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పెద్దఎత్తున విద్యార్థినులు పాల్గొన్నారు.




## ప్రతి గ్రామంలో జనసేన జెండా ఆవిష్కరించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి ఆరు ముఖ్యమైన అంశాలను సభలో ప్రవేశపెట్టి జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. జిల్లా కార్యాలయంలో జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతిఒక్కరు పనిచెయ్యాలని పేర్కొన్నారు, సమాజంలో ఆర్థిక అసమానతలు తొలిగించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న, నీతి, నిజాయితీ, నిబద్ధత, చిత్తశుద్ధి కలిగిన ఏకైక నాయకుడు పెట్టిన జనసేన పార్టీ జెండా ఆవిష్కరణలు ప్రతి గ్రామాల్లో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, గర్భాన సత్తిబాబు, భూపతి అర్జున్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు కూరాకుల యాదవ్, సంతోష్ పండా, యూపీ రాజు, జిల్లా కార్యదర్శిలు కోరుకొండ మల్లేశ్వరరావు, అంపోలు హరీష్ కుమార్, శ్రీకాంత్, మజ్జి భాస్కర్, తాలాబత్తుల పైడిరాజు, కొంచాడ చిన్నంనాయుడు, వడ్డాది శ్రీనివాసరావు, సలాన షణ్ముఖరావు, బొంతు విజయక్రిష్ణ, పల్లి కోటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శిలు వారాది వరలక్ష్మి, కీర్తి సుశీల, దాసరి బలరాం, ఇసాయి వేంకటేష్, మహ్మద్ రఫీ, చిట్టి భాస్కర్, వజ్రగడ రవికుమార్, జానీ, అనపాన జనార్దన్ రెడ్డి, కొండ్ర వరప్రసాద్, గొట్టా హరిప్రసాద్, సైలాడ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## నోటి వ్యాధులపై అవగాహన అవసరం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నోటి పరిశుభ్రత అవసరమని, నోటి ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల కలిగే నష్టాలపై భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు, మంత్రిత్వ శాఖ మై భారత్/నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో అవగాహన కల్పించింది. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ఎస్వీ రమణ మాట్లాడుతూ నోటి పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఉషా డెంటల్ క్లినిక్ వైద్య నిపుణులు డాక్టర్ స్నేహ జ్యోతి మాట్లాడుతూ నోటి వ్యాధులకు ధూమపానం ముఖ్య కారణమని, ఇది కేన్సర్‌కు దారితీస్తుందని, అధికంగా మద్యం సేవించడం వల్ల కూడా నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. విద్యాధరి డిగ్రీ కళాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జామి భీమశంకరరావు మాట్లాడుతూ చక్కెర అధికంగా ఉండే ఆహార వినియోగం, నోటి పరిశుభ్రత సరిగా లేకపోవడం, పొగాకు వంటివి నోటి రుగ్మతలకు దారితీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, లెక్చరర్ ఇన్ ఇంగ్లీష్ విటి నాయుడు, లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రెటరీ ఎస్.సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్ర ఎన్‌వైవీలు అరుగుల దిలీప్ కుమార్, గార మౌనిక, మట్ట ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు.. పైలాపచ్చీసు!

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్లు అప్పుడే భయపడుతున్నారు భయ్యో..! అంటూ ఒక పోస్టు పెడితే, 'ఇప్పుడు ఉండదు, 2029లో ఉంటుంది' అంటూ చంద్రశేఖర్ చేసిన పోస్టును, అలాగే అప్పటి ఎంపీ నందిగం సురేష్‌తో ఉన్న ఫొటోను లోకేష్‌కు ట్యాగ్ చేశారు. పవన్‌కల్యాణ్ దత్తపుత్రుడు, లోకేష్ ఉత్తపుత్రుడు అంటూ సమ్మలోరి కిల్ల ఒకడు, కమ్మలోరి సిల్లా ఇంకొకడు.. బాబోరి పుత్రులు, రాజకీయ గోచిపాతలు అంటూ కానిస్టేబుల్ భైరి చంద్రశేఖర్ పెట్టడంతో పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో అలజడి రేగింది. హోంగార్డువా, కానిస్టేబుల్‌వా? అంటూ తెలుగుదేశం అభిమానులు చంద్రశేఖర్‌ను ట్రోల్‌చేసిన పోస్టులతో పాటు అనేక అంశాల మీద ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెట్టిన ఫేస్‌బుక్ పోస్టులపై ప్రస్తుతం విచారణ చేపట్టారు. త్వరలోనే చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేసే అవకాశం కూడా ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

**గతంలోనూ ఫిర్యాదులు**

వాస్తవానికి చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ఇంతకు ముందే అనేక ఫిర్యాదులు ఏసీబీ డీజీకి వెళ్లాయి. శ్రీకాకుళంలో ఒక మహిళా వీఆర్వో పై ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టిన ఈ కానిస్టేబుల్ ఆ నెపంతో తన విధులకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఆమె భర్త కొన్నాళ్లు పోరాటం చేశారు. అయితే అప్పటి ప్రభుత్వంలో దీన్ని ఎవరూ పట్టించుకోపోవడంతో చంద్రశేఖర్ ఏసీబీలో కొనసాగుతూ వచ్చారు. ఏసీబీ నుంచి రెండు రోజుల క్రితం ఆయన్ను తప్పించడం వెనుక మహిళా వీఆర్వో భర్త చేసిన ఫిర్యాదే కారణమని అంతా భావించారు. కానీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడం వల్ల ఆయనపై విచారణ జరుగుతుందన్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. జిల్లాలో మైన్స్, కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి కూడా మంత్లీ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు కూడా వెళ్లాయి. వీటన్నిటి మీద విచారణ జరుగుతుండగా, సైబర్ క్రైమ్ పోలీసులు మాత్రం సోషల్‌మీడియాలో పోస్టులపై ఆధారాలు సేకరిస్తున్నారు.

## వైఎస్ఆర్ పేరు తొలగింపు రెడ్‌బుక్ అరాచకమే

(మొదటిపేజీ తరువాయి)

చెరిపివేయడమే ధ్యేయంగా వ్యవహరిస్తోందన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తూ క్రీడా రంగాన్ని ప్రోత్సహించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి పెట్టాలని అప్పటి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించి అమలు చేసిన విషయాన్ని స్వరూప్ గుర్తు చేశారు. దీన్ని చూసి ఓర్వలేని నారా లోకేష్ రెడ్‌బుక్‌లో ఈ అంశానికి ఒక పేజీ కేటాయించి, స్టేడియం పేరులోంచి వైఎస్ఆర్ పేరును తొలగింపజేశారని విమర్శించారు. వైఎస్ఆర్ తర్వాత 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నా అప్పుడు మాత్రం స్టేడియం పేరు మార్చడానికి ప్రయత్నించలేదని, కానీ ప్రస్తుతం కూటమి పాలనలో వైఎస్ఆర్ పేరు ఎందుకు తొలగించారో చెప్పాలని నిలదీశారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలించారని, ఆ ఐదేళ్లలో ఎక్కడా కక్ష సాధింపులు, దౌర్జన్యాలు, పేర్లు మార్పు వంటి అరాచకాలు జరగలేదన్నారు. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడైన ఎన్టీఆర్ పేరును ఒక జిల్లాకు పెట్టి రాజకీయాలకు అతీతంగా వ్యవహరించారన్నారు. కానీ చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు రాజకీయ కక్షతో వ్యవహరిస్తూ వైఎస్ఆర్ పేర్లను తొలగించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజల మనసుల్లో చిరస్థాయిగా ఉన్న వైఎస్ఆర్‌ను మాత్రం వారి నుంచి దూరం చేయలేరని స్వరూప్ వ్యాఖ్యానించారు.






## ఐజేయూ అధ్యక్షునికి అరుదైన గౌరవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డికి అరుదైన గౌరవం లభించినట్టు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యూబా రాజధాని హవానాలో జరుగుతున్న అంతర్జాతీయ మీడియా సదస్సుకు భారతదేశ ప్రతినిధిగా శ్రీనివాస్ రెడ్డికి అందిన ఆహ్వానం మేరకు, ఆయన ఆ సదస్సులో మాట్లాడే అవకాశం లభించిందని తెలిపారు. 'తప్పుడు సమాచారం, మీడియాలో వస్తున్న మార్పులను ఎదుర్కోవడం' అనే అంశంపై ఆయన ఒక సిద్ధాంత పత్రాన్ని సదస్సుకు సమర్పించినట్టు తెలిపారు. క్యూబా దేశ అధ్యక్షుడు కానెల్ ప్రారంభించిన ఈ సదస్సుకు వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. శ్రీనివాసరెడ్డికి అందిన గౌరవం భారతీయ జర్నలిస్టుల సమాజానికి అందినట్టేనని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు అన్నారు. శ్రీనివాస్ రెడ్డికి దక్కిన గౌరవం పట్ల ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.ఈశ్వరరావు హర్షం తెలిపారు.



## సీఎస్ఎస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్రైస్తవ సమాజానికి సురక్షిత సేవలు అందించడమే లక్ష్యంగా క్రిస్టియన్ సెక్యూర్ సర్వీసెస్ (సీఎస్ఎస్) శ్రీకాకుళం జిల్లాలో స్థాపించబడింది. పాస్టర్స్ ఫెలోషిప్‌లను కలుపుకుంటూ మతస్వేచ్ఛపై జరుగుతున్న అల్లర్లకు, దాడులకు నిరసనగా రాజ్యాంగం కల్పించిన హక్కులపై సమగ్ర కార్యాచరణతో పోరాడనుంది. ఈ మేరకు జిల్లా ప్రధాన కేంద్రంగా స్థానిక మెర్సి చర్చిలో సిఎస్ఎస్ నూతన కమిటీని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పాస్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు బిషప్ డాక్టర్ బర్న బాస్ బింకం (శ్రీకాకుళం), ప్రధాన కార్యదర్శి బ్రదర్ ఒంపూరు రమేష్ (శ్రీకాకుళం), కోశాధికారి పాస్టర్ ఎం.షడ్రక్ బాబు (రావాడపేట), ఉపాధ్యక్షులు పాస్టర్ జి.సామ్యూల్ అరుణ్‌కుమార్ (ఆమదాలవలస), పాస్టర్ టి.పేతురు (ఎచ్చెర్ల), సహాయ కార్యదర్శి పాస్టర్ ఆర్.శామ్యూల్ (కొయ్యాం), సహాయ కార్యదర్శి పాస్టర్ టి.సూరిబాబు (రణస్థలం) గౌరవ అధ్యక్షులు పాస్టర్ ఇ.సామ్యూల్ జాన్ (సరుబుజ్జిలి), గౌరవ సలహాదారులు పాస్టర్ ప్రత్తిపాటి ప్రసాద్ (సరుబుజ్జిలి), పాస్టర్ ఏపి పాల్ (సొట్టవానిపేట), కార్యవర్గ సభ్యులు పాస్టర్ సిహెచ్ మోజేష్ (గార), పాస్టర్ కెవి జాషువ (పాతపట్నం), పాస్టర్ బి.చిన్నారావు (సారవకోట), ప్రచార కార్యదర్శి పాస్టర్ అల్లు ఇమ్మానుయేలు (లావేరు), ప్రేయర్ కోఆర్డినేటర్ పాస్టర్ ఆశిర్‌కుమార్ (ఆమదాలవలస), యూత్ వింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ అహరోన్ నియమితులయ్యారు. సీఎస్ఎస్ ద్వారా క్రైస్తవ సమాజం తరపున రాజీ లేని పోరాటం చేస్తామని ప్రకటించారు.



## వందల ఎకరాల్లో గజరాజులు విధ్వంసం

**◆నేలమట్టమైన పంటలు ◆గగ్గోలుపెడుతున్న రైతులు ◆పరిహారం ఇప్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి**

సత్యంన్యూస్, కొత్తూరు

వంశధార నది పరివాహక ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా గజరాజులు తిష్ట వేసుకొని ఉన్నాయి. పెద్ద ఎత్తున అరటి, చెరకు, జొన్న, సారకంద తదితర పంటలను పెద్ద ఎత్తు గజరాజులు ధ్వంసం చేస్తున్నాయి. గత ఒకటిన్నర దశాబ్దాలుగా గజరాజుల బెడద ఉన్నా, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ప్రధాన సమస్యగా మారినా ఇప్పటివరకు అధికారులు సమస్య పరిష్కారం చూపడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడంలో విఫలమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందల ఎకరాల్లో పంటనష్టం, పదుల సంఖ్యలో ప్రాణనష్టం జరిగిన నేపథ్యంలో గజరాజులను తరలించి అన్నదాతను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వసప, కుంటిభద్ర, కదుము గ్రామాల్లో గజరాజుల మూలంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, పంటనష్టం అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.